# లేత మనసు

ముహూర్తం వేళవుతోంది. సన్నాయిమేళం చెవులు గింగురు మంటోంది. పందిట్లో జనంసందడికి మాట వినిపించడం లేదు. ఓ మూల పిల్లలంతా జేరి హోరుమని గంతులేస్తూ అల్లరి చేస్తున్నారు.

గీత అక్కకు పెళ్ళవుతోంది. ప్రొద్దుటినుంచి గీత సంగతి పట్టించుకున్నవాళ్ళు లేరు. ఇంట్లో ఎవరు చూసినా హడావిడిగా తిరిగేవాళ్ళే! గీత అక్కకు తలంటి పోయడం, అలంకరించడం, పెళ్లివారికి కాఫీ ఫలహారాలు పంపడం, పందిట్లో పనులు చూచుకోడం– అందరు ఏదో తొందరలోనే ఉన్నారు. అన్నింటికీ గీత తల్లి ఒకత్తే చూచుకోవాలి. ఆడపని, మగపని. భర్త సుస్తీ మనిషి. లేవలేడు. ఆవిడకు గీత, సుందరి ఇద్దరే పిల్లలు. కాన్పు ఎడం కావడంచేత ఇద్దరి పిల్లలకు వయస్సు తేడా చాలా ఉంది. సుందరికి పదహారు, గీతకు ఆరు.

అనుకోకుండా పెళ్ళికి ముందరే గీతకు పొంగు చూపింది. పెళ్లి ఆపుకోవలసి వస్తుందేమోనని గీత తల్లి భయపడింది. నాలుగురోజులు ముందరే నీళ్ళుపోశారు. ఇంకా బాగా కోలుకోలేదు. బలహీనంగా ఉంది.

పెళ్ళిరోజు ఎవరికీ గీతగోడు పట్టలేదు. ఎవరూ నీళ్లుపోయలేదు, అన్నం పెట్టలేదు. ఎప్పుడో చీకటితో లేపి తల్లి తలదువ్వి పట్టుపరికిణి, పట్టుచొక్కా తొడిగింది. మళ్ళా తరువాత నీళ్ళు పోస్తానన్నది. కాని తరవాత క్షణం తీరికలేక ఆమె గీత సంగతే మరచిపోయింది. ఉదయం పదకొండు గంటలకు

ముహూర్తం. అన్ని ఏర్పాట్లు చూసుకోవడం, వచ్చినవాళ్ళను ఆదరించడం ఆమెకు ఊపిరి సలుపలేదు.

తొమ్మిదిగంటలవరకు గీత పిల్లలతో అక్కడా అక్కడా, ఓపిక లేకపోయినా ఆడుకుంది. ఆ తరవాత ఆకలితో, నీరసంతో ఆమెకు శోష వచ్చింది. దాహంతో గొంతు ఎండుకుపోయింది. తల్లికోసం వెతుక్కుంది. ఆమె కనిపించలేదు. అటూ ఇటూ తిరుగుతూ ఉంటే, హడావిడిగా తిరిగే పెద్దవాళ్ళ కాళ్ళకు అడ్డం వస్తోంది. వాళ్ళు కసురుకున్నారు, "హాయిగా వెళ్ళి ఆడుకోక ఎందుకు కాళ్ళకు అడ్డం వస్తావు?" అని. గీతకు కళ్ళు తిరిగాయి, చెప్పలేకపోయింది. చెప్పినా వినిపించుకునేవాళ్ళు లేరు. జబ్బుపడి లేచింది. బలహీనంచేత నిస్త్రాణ ఎక్కువగా ఉంది. కళ్ళుమూసుకుని వసారాలో ఓమూల పడుకుంది. "పెళ్ళవుతోంటే వాకిలి కష్టంగా ఇక్కడ పడుకున్నావేమిటి? లే, లేచి సందిట్లోకి వెళ్ళు, అక్క పెళ్ళి చూడవూ?" అంటూ ఎవరో ఆప్యాయంగా లేపి, అక్కడినుంచి తరిమారు. తనకు అక్క పెళ్ళి చూడాలనే ఉంది. బావ ఎలా ఉన్నాడో చూడాలనే ఉంది. మేళాలు వినాలని ఉంది కాని అడుగు ముందుకు వెయ్యగానే ఒళ్ళు తూలింది. ఇంక ఇక్కడఉంటె లాభంలేదని పెరటివేపు సుబ్బలక్ష్మి ఇంటికి వెళ్ళింది.

ఆ ఆవరణలో ముగ్గురు కాపురం ఉన్నారు. మధ్య ఇంట్లో క్రింది భాగంలో గీతావాళ్ళున్నారు. మేడమీద రెండు గదులు డాబా ఉన్నాయి. అందులో కొత్తగా పెళ్లయిన జయలక్ష్మి, ఆమె భర్తా ఉన్నారు. వెనకవేపు పెంకుటింట్లో

సుబ్బలక్ష్మి, ఆమె మరదీ, పిల్లలు ఉన్నారు. సుబ్బలక్ష్మికి భర్తలేడు. చెల్లెలు పోయిన తరవాత మరదిదగ్గర ఉండి వారికి వండిపెడుతోంది. అందుకే అందరూ పెళ్లికి వెళ్లినా ఆమె ఇంట్లోనే ఉంది. గీత అప్పుడు ఆమెదగ్గరకే వెళ్ళింది. మేడమీద జయలక్ష్మి, క్రింద సుబ్బలక్ష్మి గీతను చాలా గారాబం చేస్తారు. జయలక్ష్మి భర్త ఆఫీసుకు వెళ్లగానే మళ్ళా వచ్చేవరకు గీతతో ఆడుకుంటూ ఉంటుంది. కథలు చెపుతూ గవ్వలు ఆడుతూ కబుర్లు చెపుతూ ఉంటుంది. సుబ్బలక్ష్మి ఇంట్లో ఏ పిండివంట చేసుకున్నా గీతనుపిలిచి పెడుతుంది. ఒక్కొక్క సారి అవి తీసుకుని జయలక్ష్మి ఇంటికివస్తుంది. ముగ్గురూ అవి తింటూ, ఆడుకొంటూ ఉంటారు. గీతకు తల్లిదగ్గరకన్నా వాళ్ల దగ్గరే ఎక్కువ కాలక్షేపం, చనువు. అందుకే ఇప్పుడూ సుబ్బలక్ష్మి దగ్గరకే వెళ్ళింది. మేడమీద జయలక్ష్మి లేదు. ఆమె పెళ్ళి పందిట్లోనే ఉన్నది.

సుబ్బలక్ష్మి తనకుమాత్రం పొయిమీద బియ్యంపెట్టి ఒంటరిగా ఉసూరుమంటూ మండుతున్న కుంపటిచూస్తూ కూర్చొంది, బయటజరిగే పెళ్ళిసందడితో తనకేమీ సంబంధం లేనట్లు. తలుపు తోసుకు లోపలికి వచ్చిన గీతనుచూసి ఆమె సంతోషించింది. ఆ పిల్ల పందిట్లో అందరినీ వదలి ఒంటరిగా ఉన్న తనను వెతుక్కుంటూ వచ్చినందుకు ఉప్పొంగిపోయింది. లోపలికి వస్తూనే గీత సొమ్మసిల్లినట్టు పడిపోయింది. ముఖమంతా చెమట్లు పోసినయి. సుబ్బలక్ష్మి గుండె తరుక్కుపోయింది. జబ్బుపడి లేచిన పిల్ల మళ్లాఏమైనా ఒంట్లో బాగుండ

లేదు కాబోలు అనుకుంది. "ఏం తల్లీ ఎందుకలా పడుకున్నావు, పెళ్ళి చూడకుండా వచ్చేశావేం?" అంది ఆప్యాయంగా కావలించుకుని. గీత ఏడ్చింది "నాకు చాలా ఆకలి వేస్తోంది. ఇంట్లో ఎవరూ అన్నం పెట్టలేదు. అసలు ఎవరూ నన్ను చూడ్డమే లేదు" అంది. సుబ్బలక్ష్మి గీతను లేవదీసి ఎత్తుకుంది. "నేను అన్నం పెడతానులే, అన్నం ఉడుకుతోంది" అంది. మళ్లా ఆమెకు దిగులేసింది, తాను అన్నం మాత్రం వండిందే. ఇంకేమీ చెయ్యలేదే! ఎలా పెడుతుంది అనుకుంది. గీతతో అన్నది "మీ ఇంటికి వెళ్లి ఏమైనా తెచ్చుకో, నేను అన్నం మాత్రమే వండాను" అన్నది.

గీత నిస్త్రాణతో లేచింది. ఏం చెయ్యాలో తెలీదు. ఇంటికెళ్ళి లాభంలేదు. అమ్మ కనుపించదు, ఎవరూ పలుకరు. చటుక్కున గుర్తుకు వచ్చింది. మేడమీద జయలక్ష్మి ఇంట్లో వరసగా మనిషెత్తు ఊరగాయ జాడీలు ఉన్నాయి. జయలక్ష్మి ఎప్పుడూ చెబుతూ ఉంటుంది. "మా అత్తగారు పెట్టివెళ్ళారు. ఆమె కోసం అవి అలానే మడిగా ఉంచుతాము. మైలతో ముట్టుకోము" అని. గీతకు ఓపికవచ్చింది. జయలక్ష్మి అత్తను అడిగి ఊరగాయ తెచ్చుకోవచ్చు. ఒక్క పరుగులో మేడ మీదకు వెళ్ళింది. జయ ఇంట్లో లేదు. కింద పెళ్ళింట్లోనే ఉంది. తలుపు దగ్గరగా గొళ్ళెంపెట్టి ఉంది. గీతకు ఏం చెయ్యాలో తెలీదు. ఏదో మైకం కమ్మినట్లయింది. తలుపు తెరచింది. ఏం చేస్తోందో తెలీకుండా ఒక జాడీ మూత తెరచి చేతినిండా ఉసిరిగాయ తీసుకుంది. మళ్ళా మూత పెట్టింది. తలుపు వేయకుండా

గబగబా పారిపోయింది, సుబ్బలక్ష్మి ఇంటికి. సుబ్బలక్ష్మి సంతో
షంతో ఆకువేసి గీత తెచ్చిన ఊరగాయ, మజ్జిగతో అన్నం
పెట్టింది. కడుపునిండా తిని గీత అక్కడే నిద్రపోయింది. మూడు
గంటలకు అన్నిపనులు తీరిన తరువాత, గుర్తువచ్చింది తల్లికి
గీత. ఆమె అప్పుడు వచ్చి లేపి తీసుకు పోయింది. నిద్ర లేస్తూనే
గీత జ్వరంతో లేచింది.

ముందరవేపు చిన్న గదిలో పక్కవేసి పడుకో పెట్టింది
గీతను తల్లి. లక్క బొమ్మలు తెచ్చి యిచ్చి ఆడుకొంటూఉండ
మని, ఏదో మాత్రవేసి, మళ్ళా పెళ్ళి సందట్లో పడిపోయింది.
గీతకు మళ్ళా నిద్రరాలేదు. బొమ్మలతో ఆడుకోటానికి బుద్ధి
పుట్టలేదు. మగతగా ఇంటి కప్పుకేసి చూస్తూ పడుకుంది. గీతకు
జ్వరం ఉందని తెలిసి జయలక్ష్మి వచ్చింది చూడడానికి. గీత
మంచం మీద కూర్చుని, నుదిటిమీద చేయివేసి ఆపిల్లకు
ఊసుపోక కథలు చెప్పడం ప్రారంభించింది. మళ్ళా వాళ్ళక్క
పెళ్ళి కబుర్లు చెప్పింది. గీత ఆ మాటలు సరిగా వినలేదు.
ఆ పిల్ల మనసులో ఏదో దిగులు పట్టుకుని వెక్కి వెక్కి ఏడవా
లనిపించింది. జయలక్ష్మిని చూడగానే మొదట ఆత్రుతతో
"మీ ఇంట్లో ఊరగాయ తీసుకున్నాను" అని చెప్పాలనిపిం
చింది. మళ్ళా మరుక్షణమే అవి మడిజాడీలు గదా, తనుముట్టు
కున్నానని చెపితే, మైలపడ్డాయని బాధపడుతుందేమో నని
పించింది. దాంతో గొంతు మూగబోయింది. మాటరాలేదు.
ఈ రహస్యం ఎప్పటికి ఎవరికి చెప్పడానికి వీలులేదు. అప్పుడు
తెలిసింది గీతకు తనుచేసినపని దొంగతనమని, చాలా తప్పని,

జయలక్ష్మితో చెప్పితే అప్పుడు బాధ ఉండదు. కాని చెప్ప డానికి వీలులేదు. ఆ బెంగతో జయలక్ష్మి, సరదాగా కబుర్లు చెబుతున్నా గీత లోలోపల బాధపడింది. ఏదో చేయకూడని పని చేసినట్లు, గొప్ప తప్పుచేసినట్లు కుమిలిపోయింది.

రెండు రోజుల క్రిందట గీత పక్కింటి గౌరితో ఆడుకుం టోంది. ఇద్దరూ గీతయింట్లో మండువా గదిలో ఆడుకుంటు న్నారు. గదినిండా వేరుశనక్కాయ బస్తాలు, ఆ ఏడు పంటలో వచ్చినవి ఉన్నాయి. అవి చూడగానే గౌరికి నోరూరింది. గీత దోసిలినిండా వేరుశనక్కాయలు తీసి గౌరి ఒడి నింపింది. "తీసుకుపో!' అన్నది. గౌరి భయపడింది. "మీ అమ్మచూస్తే?" అన్నది. గీత మరుక్షణంగా జవాబు చెప్పింది. "బస్తాకాయలో కొంచెంతీస్తే మాఅమ్మకు తెలియదు" అన్నది. గౌరి అడ్డంగా తల తిప్పింది. "అమ్మో! చెప్పకుండా తీసుకుపోతే దొంగతనం కాదూ ? దొంగతనం మహాపాపం. పాపంచేస్తే నరకానికిపోతా రట. నరకానికి పోతేమరి ..." ఇంకా ఏవేవో భయంకరంగా చెప్పబోయింది. గీత ముఖం వెలవెలా పోయింది. నిలువెల్లా వణకిపోయింది. గౌరి కిన్ని సంగతులెలా తెలుసా అనుకుంది. మళ్ళా ధైర్యంగా అన్నది. "ఫర్వాలేదులే నువ్వుతీసుకుపో? వేరుశనక్కాయలు తీసుకుంటే మాఅమ్మ ఏమీ అనదులే, నే చెపుతాలే" అన్నది. గౌరి వెళ్ళి పోయింది.

జ్వరంతో పడుకున్న గీతకు గౌరి మాటలు చెవులలో మారు మ్రోగాయి. దొంగతనం మహాపాపం. పాపం చేస్తే నర కానికి పోతారు. నరకానికి పోతే — గీత గజగజ వణికింది.

జ్వరం రెండింతలు ఎక్కువైంది. మతిలేనట్లు కలవరించింది: "పాపం పాపం" అని దగ్గరకూచున్న జయలక్ష్మి భయపడి అదిరి పోయింది. ఆమెకు గీత ఇంక దక్కదేమో నన్నంత భయం వేసింది. ఏడుస్తూ పరుగెత్తి ఇంట్లో అందరినీ పిలిచింది. డాక్టరు వచ్చి గీతకు నిద్రపోవడానికి మందిచ్చాడు. నిద్రపోయింది.

పెళ్ళి సందడి అయిపోయింది. వచ్చిన చుట్టాలు వచ్చి నట్టు వెళ్ళారు. ఇల్లు నిర్మానుష్యంగా, భయంకరంగా, ఒంట రిగా మిగిలింది.

గీతకు జ్వరం తగ్గింది. అయితే బలహీనత, మగత వద ల్లేదు. ఆ పిల్ల ఇదివరకులా ఆడుకోదు, మాట్లాడదు. ఏదోమతి చెడినట్లు పిచ్చిచూపులు చూస్తూ వణకిపోతూ పడుకుంటుంది. జయలక్ష్మి దగ్గరకు వచ్చినప్పుడు ఇంకా గజగజ వణకిపోయి ముడుచు పోతుంది. ఇదిచూసి జయలక్ష్మి గుండె బద్దలయింది. ఎప్పుడూ తనతో ప్రేమగా, చనువుగా ఆడుకునే పిల్ల ఇప్పుడు తన్నుచూసి ఎందుకు భయపడుతుందో తెలియక దిగులు పడింది. డాక్టరుకు గీత జబ్బు అర్థంకాలేదు. ఎన్ని మందు లిచ్చినా ఒంటబట్టవు. ఎన్నిప్రశ్నలు వేసినా, పిల్ల ఒక్కదానికీ జవాబు చెప్పదు. అతనికి ఏమీ తోచక పిల్లఏమన్నా జడుసు కున్నదేమో మంత్రం వేయించండని సలహా చెప్పాడు, తన సంస్కారానికి విరుద్ధంగా.

సెలవలకు గీత చిన్నాన్న వచ్చాడు. అతను వచ్చినప్పు డల్లా గీతకు ఎంతో సరదాగా ఉంటుంది. రోజు పార్కుకు, హోటలుకు తీసుకుపోతూ ఉంటాడు. ప్రొద్దస్తమానం గీతతో

ఆడుకుంటాడు. ఈ సారి గీత అతనితో మాట్లాడలేదు. కాని ఎవరికేసీ చూడని పిల్ల అతనికేసి దీనంగా బిక్కమొహంతో చూస్తూ ఉండేది. అతను గీతనుచూచి దిగులుపడ్డాడు. రాత్రిం పగలు ఆ పిల్లదగ్గరే కూర్చున్నాడు. ఓరోజు ఎవరూలేనప్పుడు గీత అతనితో మాట్లాడింది.

"చిన్నాన్నా" అని పిలిచింది. ఎన్నోరోజులకు వినిపించిన ఆ పిలుపుకు అతని ప్రాణం లేచివచ్చింది.

"ఏం కావాలి తల్లీ?" అన్నాడతను: గీత భయపడుతూ వినిపించీ వినిపించనట్లు మెల్లగా రహస్యంగా అడిగింది. "దొంగ తనం చాలా పాపంకదూ!" అని. "అవును. చాలాపాపం"అన్నా డతను. ఆలోచించుకోకుండా గీత ముఖం వాడిపోయింది. మళ్ళా దిగులుగా అడిగింది.

"పాపం చేస్తే నరకానికి పోతారా ?" అతనికి చికాకు వేసింది. ఎవరో గీత మనస్సు పాడుచేశారు. అతనికి వాళ్ళమీద కోపం వచ్చింది. విసుగుతో అన్నాడు "నరకం లేదు, ఏమీ లేదు అన్నీ అబద్ధాలు" అని. గీత ముఖం కొంత విప్పారింది. "నిజంగా" అన్నది ఆశతో. అతను పరధ్యానంగా అన్నాడు, "ఏదైనా పాపం చేస్తే మనమనస్సు చాలా బాధపడుతుంది. అదే నరకం. అంతకన్నా నరకంలేదు" గీత ముఖం వెలవెల పోయింది. భయంతో వణకిపోతూ "చిన్నాన్నా!" అనిగట్టిగా అరచింది. అతను అదిరిపడ్డాడు. "ఏమైందమ్మా!" అన్నాడు. ఆ పిల్ల ఇకమాట్లాడలేదు. లోలోపల కుమిలిపోయింది. తాను

నెల రోజులుగా నరకం అనుభవిస్తోం దన్న మాట! ఇందు నించి ఎలా బయటపడుతుంది. దిగులుతో గీతకు మళ్లా జ్వరం వచ్చింది.

అప్పుడు అర్థమయింది. అతనికి గీత లోలోపల ఏదో భయంతో బాధపడుతోందని. ఒక రోజు మెల్లిగా బుజ్జగించి అడిగాడు. "నువ్వేమైనా దొంగతనం చేశావా తెలీకుండా?" అని. చాలా సేపు గీత ఏమీ చెప్పలేదు. భయంతో వణికి పోతూ ఊరుకుంది. మెల్లగా చెప్పింది. పెళ్ళిరోజు తనకు ఆకలి నీరసం, తాను సుబ్బలక్ష్మి ఇంటికెళ్ళడం, జయలక్ష్మి ఇంట్లో ఊరగాయ తేవడం అన్నీ చెప్పి, ఏదో తప్పుచేసినట్లు వెక్కి వెక్కి ఏడ్చింది. అతను అపరిమితమైన జాలితో ఆ పిల్ల తల నిమురుతూ అన్నాడు. "ఏం ఫరవా లేదు. చేసినపాపం చెబితే పోతుందట. జయలక్ష్మి అత్తతో చెప్పేసెయ్యి" అన్నాడు. గీత భయపడింది. "అమ్మో! ఎలా! మడి జాడీలన్నీ మైల బడతాయిగా! అత్త ఏమనుకుంటుందో!" అన్నది అమాయకంగా! అతనికి అదేదో గడ్డుసమస్యలా తోచింది. ఏం చెయ్యాలో తెలియలేదు. ఏమైనా చేస్తేగాని గీత ఈ దిగులు లోంచి బయట పడేటట్లు కనిపించలేదు.

మర్నాడు జయలక్ష్మి గీతను చూడడానికి వచ్చినప్పుడు యథాలాపంగా అడిగాడు "మీ ఊరగాయలన్నీ మడితోనే ఉంటాయేమిటె?" అని. "అబ్బే ఎప్పుడో మా అత్తగారు మడితో పెట్టివెళ్ళారు. నే నెప్పుడో మైలపడేశాను" అంది ఆమె నిర్లక్ష్యంగా. అతని ముఖమూ, గీత ముఖమూ ఒక్కసారి విప్పారి

నాయి. అతను మళ్లా మెల్లగా అన్నాడు. "గీత మీాజాడీలో ఊర గాయ తీసిందట, మీారు లేనప్పుడు ఓసారి" అని. జయలక్ష్మి వెక్కిరింతగా నిర్లక్ష్యంగా నవ్వింది. "ఓస్ ! ఇంతేనా! అది నాతో చెప్పాలా ? ఏ తీసుకుంటే?" అంది. పక్కమీాదనుంచి ఒక్కసారి దుమికి గీత జయలక్ష్మిని గట్టిగా కావిలించుకుంది. జయలక్ష్మి ఉక్కిరి బిక్కిరయింది. "అన్ని భావాలలోకి ఏదో తప్పుచేశామన్న భావం భయంకరమైనది. అది మనస్సులో ప్రవేశిస్తే, కోలుకోవడం కష్టం" అన్నాడు అతను. ఆమాటలు ఎందుకో సరిగా అర్థంగాక జయలక్ష్మి తెల్లబోయింది. గీత సంతోషం ఆపుకోలేక విరగబడి నవ్వింది. గీత మళ్లా మామూలుగా ఉందని జయలక్ష్మి మురిసిపోయింది. అతను ఏదో విజయం సాధించినట్లు ఉప్పొంగిపోతూ, అందరినీ పిలిచాడు.